క్లుప్తంగా

నేడు మేడిగడ్డ తండాలో వైద్య శిబిరం

ఆమనగల్లు: మండల పరిధిలోని మేడిగడ్డతండాలో ఈ నెల 6న ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్ మెడిహబ్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేసి మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎంపీ మల్లు రవిని కలిసిన నాయకులు



ఎంపీ మల్లు రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవిని మంగళవారం ఢిల్లీలో ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమనగల్లు మాజీ సర్పంచ్ కేశవులు, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి దశరథం తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగిరం చేయాలి

మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్: ఎల్ఆర్ఎస్–2020లో భాగంగా ఫీజు చెల్లించిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి ప్రొసీడింగ్స్ జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. మంగళవారం ఆయన రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలన చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న లింగరావుపల్లి గ్రామస్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం లింగరావుపల్లిలో ఆలయ, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 56, 62లో ప్రభుత్వ స్థలం ఉందని ఈ స్థలంలో గ్రామ దేవతల ఆలయాలున్నాయని వివరించారు. అదే స్థలంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, తిరుపతి, జంగయ్య, కుమార్, అశోక్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు ప్రధానం

మండల వ్యవసాయాధికారి రవినాథ్

యాచారం: పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని.. సకాలంలో ఎరువులు, పురుగు మందులు చల్లితే పంటల ఎదుగుదల, దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంటుందని మండల వ్యవసాయాధికారి రవినాథ్ అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ వారి కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సమన్వయంతో రైతుల పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పంటల సాగు, కలుపు మొక్కల నివారణ, పురుగు మందుల పిచికారీపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్లో డిమాండ్‌ను గుర్తించి రైతులు పంటల సాగు చేపడితే మంచి లాభాలు ఆర్జించవచ్చునన్నారు. ప్రతీ ఏడాది పంటల మార్పిడి చేయాలని, ప్రతిసారి ఒకే పంట సాగు చేస్తే భూసారంలో తేడాలు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు బసవన్నప్ప, వెంకట్‌రెడ్డి, హోన్నప్పగౌడ, రాధ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’.. బకాయి

- చేసిన పనులకు బిల్లులు అందక కూలీల నిరాసక్తత
- 16 వేల మందికి గాను కేవలం 200 మంది మాత్రమే పనులకు..
- వనమహోత్సవం టార్గెట్ పూర్తికి అధికారుల తంటాలు



గునుగల్‌లో గుంతలు తీసి మొక్కలు నాటుతున్న కూలీలు (ఫైల్)

యాచారం: ఉపాధి కూలీలకు సకాలంలో బకాయిలు అందక పనులకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. నెలల తరబడి కూలి చెల్లించకపోవడంతో పస్తులుండాల్సి వస్తుందని వాపోతున్నారు. మండల పరిధిలోని 24 గ్రామాల్లో 9,682 జాబ్‌కార్డులకు గాను 16,838 మంది కూలీలున్నారు. మొత్తం కూలీల్లో దాదాపుగా 8 వేల నుంచి పది వేలకు పైగానే ఉపాధి పనులకు వెళ్తారు. వానాకాలం, యాసంగి సీజన్‌లో మాత్రం వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. జూన్ నుంచి వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న దృష్ట్యా కొద్ది మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు.

రూ. కోటిన్నరకు పైగా బకాయి

మండలంలోని 5 వేల మందికి పైగా కూలీలలకు నెలల తరబడి బిల్లులు అందడం లేదు. కొత్తపల్లి, యాచారం, మంతన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లి, మొండిగౌరెల్లి, చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ, గునుగల్, మల్కీజ్‌గూడ, చింతపట్ల, మాల్ తదితర గ్రామాల్లో కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి ఉంటారు. ఈ పనులకు గాను వారికి దాదాపు రూ.కోటిన్నరకు పైగానే బకాయి ఉంది. దీంతో బకాయి చెల్లించాలని ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోయారు. డబ్బులు అందడం లేదని కేవలం 200 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు.

బకాయిలున్నది వాస్తవమే



ఉపాధి కూలీలకు రెండు నెలలుగా బకాయిలున్నది వాస్తవమే. దాదాపుగా రూ.కోటిన్నరకు పైగా ఉండొచ్చు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న దృష్ట్యా కూలీలు గుంతలు తీసే పనులకు ఆసక్తి చూపడం లేదు. పనులకు వచ్చే కూలీలతో ఆయా గ్రామాల్లో గుంతలు తీయించి, మొక్కలు నాటి టార్గెట్‌ను పూర్తి చేస్తాం.

– రాధారాణి, ఎంపీడీఓ యాచారం

నాటింది 38 వేల మొక్కలే

ఈ ఏడాది యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 24 నర్సరీల్లో పది వేల చొప్పున మొక్కలు నాటారు. ప్రతీగ్రామంలో 8 వేల మొక్కల చొప్పున 24 గ్రామాల్లో 2.40లక్షలు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ ఇప్పటి వరకు 41 వేల గుంతలు తీసి 38 వేల మొక్కలు మాత్రమే నాటారు. ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో గుంతలు తీసే పనులకు కూలీలు ఆసక్తి చూపడం లేదు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాయంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన గుర్క శ్రీకాంత్ యాదవ్, బాలకృష్ణ, మధు, మహేశ్, గణేశ్, లింగం, సురేశ్, రమేశ్, మహేశ్, మల్లేశ్, మధు, శ్రీరాములు, వంశీ, శ్రీకాంత్, ధనుంజయ్, ఆంజనేయులు, నాగరాజు, మహేశ్ తదితరులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను చూసి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ప్రవీణ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, శివయాదవ్, నర్సింహ, జైపాల్‌రెడ్డి, రమేశ్, రాములు, వెంకటేశ్, శ్రీకాంత్, చరణ్, భిక్షపతి, మహేశ్ తదితరులు ఉన్నారు.

మహాధర్నాకు బీసీలు తరలిరండి

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్



మాట్లాడుతున్న దళపతి గౌడ్

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఆమోదించాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ బిల్లు ఆమోదం కోసం బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు బీసీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, పురుషోత్తం రెడ్డి, సయ్యద్ సలీం, నాగరాజు, వెంకటేశ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు ఆర్థికసాయం



ఇబ్రహీంపట్నం: ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి



ఆమనగల్లు: ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలకు సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కర్ణంగూడకు చెందిన వంగేటి ప్రతాప్‌రెడ్డి, శేరిగూడకు చెందిన బొద్దు రాంరెడ్డి, ఇబ్రహీంపట్నంకు చెందిన రామావత్ భిక్షపతి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సీఈఓ గణేశ్, సభ్యులు సీతయ్య, పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు..

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామానికి చెందిన ఆండాలమ్మ వైద్య ఖర్చులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ రూ.5 వేలు, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి రూ.5వేలు అందజేశారు. నగరంలోని ఉప్పల చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో మంగళవారం బాధిత కుటుంబానికి ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ నగదు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, వంశీ, మహేశ్, విజయ్, కార్తీక్, సందీప్, అంజయ్య పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేస్తాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం, కందుకూరు మండలాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు షేక్ అజాం, షేక్ చోటామియాతో పలువురు మైనార్టీ నాయకులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగు చెంది బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం దక్కలేదన్నారు. త్వరలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతర్ల అంబయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఆనందం, శివగంగ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు మునగపాటి నవీన్, నిమ్మగూడెం సుధీర్ గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అదిల్ అలీ, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో రోడ్లు అధ్వానంగా మారాయని.. వెంటనే బాగుచేయాలని అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు కంబాలపల్లి సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిగూడ గాంధీ విగ్రహం నుంచి శ్రీ దత్త ఇంజనీరింగ్ కాలేజీ వరకు, దుర్గమ్మ తల్లి ఆలయం నుంచి పోచమ్మ తల్లి ఆలయం వరకు సీసీ రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. ఈ నెల 10వ తేదీన బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లు మరమ్మతులు చేయాలని కోరారు.

కేంద్ర పథకాలు నిరుపేదలకు వరం

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కందుకూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో నిరుపేదలకు వరాలుగా మారాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీజేపీ సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలు, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతో మేలు చేశాయన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కందుకూరు: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 375వ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ స్వామిగౌడ్, డాక్టర్ రామారావు హాజరవుతున్నారన్నారు. మండలం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, యుగేంధర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, రవీందర్‌గౌడ్, తిరుపతిగౌడ్, కృష్ణగౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వేతన సవరణ చేయండి

మంత్రికి గ్రూప్–4 ఉద్యోగుల వినతి

బడంగ్‌పేట్: గ్రూప్–4 ఉద్యోగుల వేతన సవరణ చేసి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ పీఎస్సీ నుంచి గ్రూప్–4 కింద ఎంపికయ్యామన్నారు. మాకు ఇచ్చిన విధుల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, రేషన్‌కార్డుల సర్వే, ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్స్, ట్రేడ్ లైసెన్సులు, శానిటేషన్, భువన్ సర్వే, ఎల్ఆర్ఎస్ తదితర బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మున్సిపాలిటీలకు, కార్పొరేషన్ల రెవెన్యూ పెంచడానికి కీలకపాత్ర పోషిస్తున్నామని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ల కంటే గ్రూప్–4 ఉద్యోగుల వేతనాలు తక్కువగా ఉన్నాయని, వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డిగ్రీతో నియమితులైన గ్రూప్–4 ఉద్యోగులకు ఇంటర్‌తో వస్తున్న జూనియర్ అసిస్టెంట్ల కంటే తక్కువ వేతనాలు అందించడం సరికాదన్నారు. గ్రూప్–4 ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు మంత్రికి విన్నవించారు.

వైభవం.. కల్యాణోత్సవం



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ఒగ్గు కళాకారులు అమ్మవారికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మండల పరిధిలోని భక్తులు, నాయకులు ఉత్సవాలకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఉత్సవాలకు హాజరైన శ్రీపతి కిషన్ రెడ్డి ఆలయాభివృద్ధికి రూ.50 వేలు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు విరాళం అందజేశారు. ఈ ఉత్సవాల్లో మాజీ వైస్ ఎంపీపీ జోగు వీరయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సుగుణ సాయిలు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఉమావతి, లచ్చిరామ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ ముత్యాలు, నాయకులు తదితరులు ఉన్నారు.

‘హలో బీసీ.. ఛలో ఢిల్లీ’కి ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు: విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: బీసీ రిజర్వేషన్ల ఆమోదానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో చేపట్టే బీసీ మహాధర్నాకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. నగరంలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు నాయకులు ఢిల్లీకి బయలుదేరారు. ఢిల్లీకి తరలిన వారిలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, శెట్టిపల్లి మాజీ సర్పంచ్ సత్యం, కాంగ్రెస్ నాయకులు బాలరాజు, అజీం తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కడ్తాల్: ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి పంచాయతీకి చెందిన పెద్దమోని మల్లేశ్‌కు రూ.33 వేలు, ప్రవీణ్‌చారికి రూ.40 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే మంగళవారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చల్లా సురేందర్‌రెడ్డి, అడ్వకేట్ గణేశ్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ నరేందర్, కాంగ్రెస్ చల్లంపల్లి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, జగన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన



ముకునూర్‌లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని ముకునూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను ఎంపీడీఓ జంగయ్యగౌడ్ మంగళవారం పరిశీలించారు. ఎస్‌బీఎం నిధులు వెచ్చించి గ్రామంలో మూడు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. గ్రామంలోని మురుగు, వర్షపు నీరు ఈ ఇంకుడు గుంతల్లో స్టోర్ అయ్యేలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

నందివనపర్తిలో ఇంటింటికీ బీజేపీ



కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న పార్టీ శ్రేణులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు విజయనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, అంజయ్య యాదవ్, మేకల యాదగిరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తాండ్ర రవీందర్, గోగికార్ రమేష్, రాజు, విజయ్‌కుమార్, కొండాపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ

కందుకూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డ పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు ఇవ్వాలని మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బాలింతలు, గర్భిణులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. మొదటి ఆరునెలలు ఎలాంటి ఫార్ములా లేకుండా ప్రత్యేకంగా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. తల్లిపాలు తాగే పిల్లలకు చెవి ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ వ్యాధులు, అతిసారం తదితర వ్యాధులు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. బాల్యంలో తల్లిపాలు తాగిన పిల్లల ఐక్యూ స్థాయి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లి బిడ్డలకు పాలు ఇవ్వడంతో తల్లికి రొమ్ము, అండాశయ కేన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, మరో పక్క తల్లికి బిడ్డకు మధ్య అనుబంధాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ సుల్తానా, డాక్టర్ అఖిల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు యశోధ, రేణుక, సుమతి, సౌభాగ్య, సరస్వతి, దీపా పాల్గొన్నారు.



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386